నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, సోమవారం 18 నవంబర్ 2024 | MEDAK

అన్నదానానికి మించిన దానం మరొకటి లేదు

సిద్దిపేట ప్రభుత్వ దవాఖాన వద్ద ఇతిహాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేటలో నిత్యం పేదల ఆకలి తీరుస్తున్న ఇతిహాద్ ఫౌండేషన్ సభ్యులకు అభినందనలు

సిద్దిపేట, నవంబర్ 17: అన్నదానానికి మించిన దానం మరొకటి లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట ప్రభుత్వ దవాఖాన వద్ద ఇతిహాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నదాన కార్యక్రమం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన హాజరై అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఆకలితో అలమటిస్తున్న వారికి కడుపునిండా అన్నం పెట్టి నిరుపేదలకు సేవ చేయడం గొప్పవిషయమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆపదలో దవాఖానకు వచ్చే ఎంతోమంది పేదల కడుపునిండా అన్నం పెట్టే కార్యక్రమం వెయ్యి రోజుల నుంచి ఇతిహాద్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అతిక్ అహ్మద్ నిర్వహించడం చాలా మంచిపని అని ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఇంట్లో పుట్టినరోజు వేడుకలు జరుపుకోకుండా ఆవనరులను పుణ్యకార్యానికి వినియోగించడం వారి నిబద్ధతకు నిదర్శనమన్నారు. పేదలకు అన్నం పెట్టి వారి ఆకలి తీర్చడం వారి నిస్వార్థ సేవకు అద్దం పడుతుందన్నారు. గ్రామాల నుంచి పేదలు దవాఖానకు వస్తున్నారని వారికి అన్నం పెట్టడం సంతోషకరమన్నారు. బైబిల్, ఖురాన్, భగవద్గీత అన్ని గ్రంథాలు కూడా మానవసేవయే మాధవసేవ అని బోధించాయన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అతిక్ అహ్మద్, ఫౌండేషన్ సభ్యులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సిద్దిపేట అన్నదాన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

చేర్యాలకు పూర్వవైభవం తెస్తా

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల దుర్గామాత ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, నవంబర్ 17: కనక దుర్గామాత ఆశీస్సులతో చేర్యాల ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరుకున్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాలలో కనకాదుర్గామాత ఆలయ వార్షికోత్సవాలకు ఆదివారం ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మాట్లాడుతూ.. పాత నియోజకవర్గ కేంద్రమైన చేర్యాలకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీశ్‌గౌడ్,మాజీ ఎంపీపీలు మేడిశెట్టి శ్రీధర్, బద్దిపడిగె కృష్ణారెడ్డి, వుల్లంపల్లి కరుణాకర్, మాజీ వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి, ఏఎంసీ వైస్ మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, టౌన్, మండల అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, అనంతుల మల్లేశం, మంద యాదగిరి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జింకల పర్వతాలు, గదరాజు చందు, నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, పచ్చిమడ్ల సిద్దిరాములు, యాట యాదగిరి, తాడెం రంజితాకృష్ణమూర్తి, పచ్చిమడ్ల మానస, ఉట్కూరి అమర్‌గౌడ్, మంచాల కొండయ్య, కనకయ్య, ఎర్రోల్ల యాదగిరి, రాజేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



చేర్యాల దుర్గామాత ఆలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కంకర వేశారు.. రోడ్డు నిర్మాణం మరిచారు

- నెలలు గడుస్తున్నా ముందుకు సాగని పనులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు

రాయపోల్, నవంబర్ 17: సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రామారం నుంచి వయా సయ్యద్‌నగర్ మీదుగా గుర్రాలసోఫ వరకు రోడ్డు మరమ్మతు పనులు జరగడం లేదు. దీంతో ప్రయాణికులతోపాటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం ఫలితంగా ఆ రోడ్డుపై వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. రోడ్డు మరమ్మతు కోసం నిధులు మంజూరు చేసినా పనులు ఎందుకు జరగడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఈ రోడ్డుగుంతలమయంగా మారడంతో మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా రోడ్డును తవ్వి కంకర వేసినా పనులు మాత్రం జరగడం లేదు. కంకర వేసిన రోడ్డుపై రోజూ ప్రయాణికులు, వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. పనులు త్వరగా పూర్తిచేయాల్సిన అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతోనే ఈ దుస్థితి వచ్చిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కంకర వేశారు... బీటీ రోడ్డు వేయడం లేదని ప్రజలు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నిత్యం వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువుల కోసం గజ్వేల్‌కు వెళ్తారు. అయితే వీరికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. కంకర వేసిన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. తొగుట సీఐ లతీఫ్, ఎస్సై రఘుపతి ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి బస్సును పునరుద్ధరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా కంకర వేసి ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు.

రాయపోల్ మండలం రామారం నుంచి గుర్రాలసోఫ వరకు కంకరవేసి వదిలేసిన బీటీ రోడ్డు

కేసీఆర్ హయాంలో యాదవులకు పెద్దపీట

మాట్లాడుతున్న హరీశ్‌రావు

సదర్ ఉత్సవంలో పాల్గొన్న హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి

- ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించారు
- సిద్దిపేట సదర్ ఉత్సవంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేటలో అట్టహాసంగా సదర్ ఉత్సవాలు

సిద్దిపేట, నవంబర్ 17: యాదవుల అభివృద్ధికి గులాబీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చాలా ప్రాధాన్యం ఇచ్చారని, యాదవులు కోసం రూ.వేల కోట్లు ఖర్చు పెట్టిన ఘనత కేసీఆర్‌దేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో చింతల అజయ్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. హరీశ్‌రావు అంటే సిద్దిపేట.. సిద్దిపేట అంటే హరీశ్‌రావు అనే బ్రాండ్ ఇమేజ్ ఉన్న ప్రజానాయకుడు అన్నారు. నిరంతరం ప్రజల కోసం,అభివృద్ధి కోసం పరితపించే నాయకుడు సిద్దిపేట ప్రజలకు దొరకడం అదృష్టమన్నారు. వచ్చే సంవత్సరం నుంచి అందరూ సిద్దిపేటలో కలిసి సదర్ నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లో కూడా సదర్ నారాయణగూడలో గొప్పగా నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో సుమారు 60 లక్షల మంది యాదవ జనాభా ఉన్నదని, భవిష్యత్‌లో యాదవుల ఐక్యతకు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. బీసీ కులాల్లో చైతన్యం వస్తున్నదని, యాదవుల్లో ఐక్యత దెబ్బ తీయడానికి చాలామంది ప్రయత్నం చేస్తున్నారన్నారు. యాదవ కులానికి చెందిన వ్యక్తిని రాజ్యసభకు పంపిన ఘనత కేసీఆర్‌దేనని.. ఆరుగురు ఎమ్మెల్యేలను చేశాడని గుర్తు చేశారు. ఎంతో మందికి కార్పొరేషన్ పదవులు ఇచ్చి గౌరవించారన్నారు. ఇప్పటి ప్రభుత్వంలో యాదవులు లేనే లేరని, తాను ఒక్కడినే ఎమ్మెల్యే అని తలసాని అన్నారు. యాదవుల కోసం హైదరాబాద్‌లో ఐదెకరాల స్థలం ఇచ్చి ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

సిద్దిపేట సదర్ ఉత్సవంలో అతిథులకు జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు

సిద్దిపేట సదర్ ఉత్సవంలో పాల్గొన్న ప్రజలు

'మల్లన్న'ను దర్శించుకున్న భక్తులు

పట్నం వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

చేర్యాల, నవంబర్ 17: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో నిండిపోయింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. 10వేల మందికి పైగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఏఈవో శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలు అందించారు.



సిద్దిపేట సదర్ ఉత్సవంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్

సదర్ అంటే అందరి పండుగ

సదర్ అంటే అందరి పండుగ అని, పండుగ అనేది కులాల మధ్య ఐక్యత పెంచుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్, తెలంగాణకు ఒక ప్రత్యేకత ఉందని, ప్రపంచంలో పూలను పూజించే పండుగ తెలంగాణలో ఉందన్నారు. బోనాల పండుగ.. అమ్మవారి కోసం గొప్పగా నిర్వహించే పండుగ కూడా హైదరాబాద్‌కే సొంతమన్నారు. అడవి జంతువులను సాధు జంతువులుగా మార్చిన ఘనత యాదవులకే దక్కుతుందన్నారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి చెందిందన్నారు. ఇప్పుడు సీఎం ఏడాదిలో ఏం తక్కువ చేశామని మాట్లాడుతుండు.. రేవంత్‌రెడ్డి అధికారంలో వచ్చిన తర్వాత పథకాలన్నీ బంద్ అయ్యాయన్నారు. బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్లు, రైతుబంధు, యాదవులకు గొర్రె పిల్లల పంపిణీ పథకం బంద్ చేశాడన్నారు. రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉండి మాట్లాడటం కాదని, గల్లీలోకి వచ్చి అడిగితే అభివృద్ధి ఏంటో తెలుస్తుందన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. యాదవుల కోసం పోరాడిన వ్యక్తి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పోచబోయిన శ్రీహరి యాదవ్, తెలంగాణ ఉద్యమ నేత రాజారామ్‌యాదవ్, చింతల అజయ్ కుమార్ యాదవ్, మామిండ్ల ఐలయ్య యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కడవెరుగు రాజనర్సు, రాజ యల్లయ్యయాదవ్, కౌన్సిలర్లు బర్ల మల్లికార్జున్, మొయిజ్, గుడాల సంధ్యాశ్రీకాంత్ పాల్గొన్నారు.

కలెక్టర్ సంతకం ఫోర్జరీ

- నలుగురికి రిమాండ్
- సంగారెడ్డి జిల్లాలో ఘటన



రిమాండ్‌కి వెళ్లిన నిందితులు

నిందితులు తయారు చేసిన ఫేక్ ఎన్‌వోసీ

రామచంద్రాపురం, నవంబర్ 17: ప్రభుత్వ భూమిని విక్రయించేందుకు ఓ ముఠా ఏకంగా కలెక్టర్ సంతకాన్నే ఫోర్జరీ చేసి ఎన్‌వోసీని తయారుచేసింది. ఈ విషయం ఆర్‌సీపురం తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డికి తెలియడంతో ఆయన విచారణ చేసి కొల్లూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. వివరాలిలా ఉన్నాయి.. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లో సర్వేనంబర్ 191లో స్వాతంత్ర్య సమరయోధుల కోటాలో అందోల్ నియోజకవర్గం అల్లాదుర్గం మండలానికి చెందిన కె.మాణయ్య, ఎం.చంద్రయ్య, బాలయ్య, టేక్మాల్‌కు చెందిన సాంబ మల్లమ్మ, సంగమ్మకు రెండు ఎకరాల చొప్పున మొత్తం 10 ఎకరాల భూమిని 1997లో ప్రభుత్వం కేటాయించింది. 2005లో నిబంధనలకు విరుద్ధంగా ఆ భూమిని ఇతరులకు విక్రయించారు. దీంతో రెవెన్యూ అధికారులు ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడంతో అప్పటి నుంచి ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. ఆ భూములపై తమకు హక్కులు ఉన్నాయని స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు మళ్లీ విక్రయించేందుకు ప్రయత్నాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో ఆ భూములు కొనుగోలు చేసేందుకు స్థానికంగా ఉండే న్యూ ఎంఐజీకి చెందిన శ్రీనివాస్ ముందుకు వచ్చాడు. పది ఎకరాల భూమిని ఎకరం రూ.1.50కోట్ల చొప్పున ఒప్పందం కుదుర్చుకొని అగ్రిమెంట్ చేసుకున్నాడు. స్వాతంత్ర్య సమరయోధుల వారసులైన వీరేశం, రాములు, సుధాకర్, నాగరాజు, సంతోష్‌కు రూ.లక్ష చొప్పున రూ.5లక్షలు ఇచ్చాడు. శ్రీనివాస్‌తో పాటు మరికొందరు ఓ ముఠాగా ఏర్పడి ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించేందుకు ఎన్‌వోసీ అవసరం ఉండడంతో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి సంతకాన్ని ఫోర్జరీ చేసి స్వాతంత్ర్య సమరయోధుడు బి.బాలయ్య పేరుపై రెండు ఎకరాలకు ఎన్‌వోసీని తయారు చేశారు. ఈ ఎన్‌వోసీ వాట్సాప్‌లో ఆర్‌సీపురం తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డికి రావడంతో అది గమనించిన ఆయన దీనిపై విచారణ చేపట్టారు. కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేశారని గుర్తించిన ఆయన కొల్లూర్ పోలీసులకు ఈనెల 14న ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ రవీందర్ విచారణ చేపట్టారు. ఆ భూములు విక్రయించేందుకు ప్రయత్నించిన వీరేశం, రాములు, సుధాకర్, నాగరాజును పోలీసులు విచారించారు. ప్రభుత్వ భూమిని విక్రయించేందుకు ప్రయత్నం చేశామని, కలెక్టర్ సంతకాన్ని శ్రీనివాస్ అనే వ్యక్తి ఫోర్జరీ చేశారని వాళ్లు పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు ఆ నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, శ్రీనివాస్ ప్రస్తుతం పరారీలో ఉండడంతో పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారు. శ్రీనివాస్‌తో పాటు టేక్మాల్‌కు చెందిన సంగమ్మ మనవడు సంతోష్ పరారీలో ఉన్నాడని ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు.

వినాయకనగర్‌లో విషాదం

- తల్లి ఫోన్ లాక్కుందని ఉరివేసుకున్న కూతురు
- సంగారెడ్డి జిల్లా బొల్లారం పీఎస్ పరిధిలో ఘటన

జియాకుమారి (ఫైల్)

బొల్లారం, నవంబర్ 17: మొబైల్‌లో గేమ్స్ ఆడుతున్న కూతురు నుంచి ఫోన్ లాక్కొవడంతో ఆమె మనస్తాపానికి గురైన ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా బొల్లారం పీఎస్ పరిధిలోని వినాయక నగర్‌లో చోటు చేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం... బీహార్ రాష్ట్రానికి చెందిన మనుసింగ్ కొంతకాలంగా బొల్లారంలోని వినాయకనగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతడికి కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. చిన్న కూతురు జియా కుమారి(14) ఎనిమిదో తరగతి చదువున్నది. ఈనెల 15వ తేదీ రాత్రి మనుసింగ్ భార్య పింకిదేవి ఇంట్లో పనిచేస్తుండగా అదే సమయంలో జియాకుమారి ఫోన్‌లో గేమ్స్ ఆడుతోంది. పనికి సహాయం చేయాలని తల్లి కూతురు చేతిలోనిఫోన్‌ను తీసుకొని పక్కన పెట్టింది. దీంతో కూతురు జియాకుమారి బెడ్‌రూంలోకి వెళ్లి డోర్ వేసుకుంది. కొద్ది సేపటి తర్వాత పింకిదేవి గదిలోంచి బయటకు రావాలని పిలిచినా కూతురు రాలేదు. పెద్ద కూతురు అనామిక గది వెనుక వైపు ఉన్న కిటికీ నుంచి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. వెంటనే తండ్రి మనుసింగ్ జియాకుమారిని కిందికి దింపి సమీపంలో ఉన్న దవాఖానకు, ఆ తర్వాత మెరుగైన వైద్య కోసం మరో దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. ఆదివారం మృతురాలి తండ్రి మనుసింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైతుల పరిస్థితి అగమ్యగోచరం

- సన్నాలు అమ్ముకునేందుకు అవస్థలు
- కొర్రీలు పెట్టి ధర తగ్గిస్తున్న మిల్లర్లు
- మెదక్ జిల్లాలో సన్నాల కొనుగోలుకు 91 కేంద్రాలు ఏర్పాటు
- 17 శాతం తేమ ఉండాలని నిబంధన
- ఇప్పటికీ కొనుగోలు చేసింది 300 మెట్రిక్ టన్నులు మాత్రమే

మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లై డీఎం హరికృష్ణ

చేగుంట మండలం రెడ్డిపల్లిలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

మెదక్, నవంబర్ 17(నమస్తే తెలంగాణ): సన్నధాన్యం పండించిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఓవైపు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభించకపోవడం, మరోవైపు మిల్లర్లు రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. మిల్లర్లు రకరకాల కొర్రీలు పెట్టి ధరను పూర్తిగా తగ్గిస్తున్నారు. కోతలు ప్రారంభ సమయంలో క్వింటాల్‌కు రూ.2,500 చెల్లించి కొనుగోలు చేసిన మిల్లర్లు.. ఇప్పుడు సన్నధాన్యం అధికంగా వస్తుండడంతో ధరను పూర్తిగా తగ్గించారు. క్వింటాల్‌కు రూ.2,150 నుంచి రూ.2,400 మించి చెల్లించడం లేదు. కొందరికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.2,320 కూడా చెల్లించడం లేదు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. దొడ్డు ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుండగా.. సన్నాలను మాత్రం మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ సారి సన్నాలను కూడా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం జిల్లాలో 91 కేంద్రాలు ఏర్పాటు చేసింది. అయితే ఈ కేంద్రాల్లో అమ్ముకునేందుకు రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో రైతులు మిల్లర్ల వద్దకు తీసుకువెళ్తున్నారు. ఇదే అదనుగా భావించిన మిల్లర్లు ధరలో కోత పెడుతూ నిలువు దోపిడీ చేస్తున్నారు.

రూ.500 బోనస్ అందేనా...

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సన్న ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. దీంతో రైతులు ఈ వానకాలం సీజన్‌లో సన్న ధాన్యాన్ని పండించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే రూ.500 బోనస్ అందనుందో లేదోనన్న భయాందోళనలో రైతులు ఉన్నారు. మెదక్ జిల్లాలో ఈ సీజన్‌లో మొత్తం 2,97,399 ఎకరాల్లో వరిసాగు కాగా అందులో 1,04,974 ఎకరాల్లో సన్న వరి, 1,92,365 ఎకరాల్లో దొడ్డు రకం సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా 488 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో సన్న ధాన్యం సేకరణ కోసం 91 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 300 మెట్రిక్ టన్నుల సన్నధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం 40 కిలోల బస్తాకు 41 కిలోలు మాత్రమే తూకం వేయాల్సి ఉండగా, రైతులు ధాన్యాన్ని శుద్ధి చేయకుండా 40 కిలోల బస్తాకు 43కిలోల చొప్పున తూకం వేయిస్తున్నారు.

తేమ శాతం 17 ఉండాలని నిబంధన

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం 17 శాతం తేమ వస్తేనే కొనుగోలు చేయాలనే నిబంధన ఉంది. అలా తెచ్చిన ధాన్యానికి మద్దతు ధరపై రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. కానీ మిల్లుల్లో అయితే నేరుగా కొనుగోలు చేస్తారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో ధాన్యాన్ని ఆరబెట్టడం రైతులకు ఇబ్బందిగా మారుతోంది. దీంతో రైతులు మిల్లర్లు చెప్పిన రేటుకే విక్రయించి నష్టపోతున్నారు.